ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి



జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన మానవ మృగాన్ని వెంటనే కఠినంగా శిక్షించాలి. మహిళా డాక్టర్లకు, వైద్య సిబ్బందికి ప్రభుత్వ భద్రత కల్పించాలి. రోగులకు వైద్య సేవలందించడంలో ఎంతో ఓర్పు, సహనంతో వ్యవహరిస్తుంటం. అలాంటి వైద్యులకు రక్షణ లేకుంటే ఆస్పత్రులలో విధులు నిర్వర్తించడం కష్టతరం. రాత్రిపూట అదనపు సెక్యూరిటీని నియమించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తే బాగుంటుంది. – డాక్టర్ బి.సిద్దయ్య, పీహెచ్‌సీ వైద్యులు, కోనంపేట, లక్కిరెడ్డిపల్లి

ప్రత్యేక చట్టాలు అమలు చేయాలి



ప్రజల ప్రాణాలను కాపాడే డాక్టర్ల ప్రాణాలకే రక్షణ లేకుండా పోతోంది. కోల్‌కతా ఘటన అమానుషం. ఈ ఘటన యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. నిందితులను ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలి. మహిళా డాక్టర్లు, ఆరోగ్య సిబ్బంది రాత్రిపూట విధులు నిర్వర్తించే సమయంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలి. ప్రధానంగా ఆస్పత్రి ప్రాంగణంలోకి మద్యం మత్తులో ఉండే వారిని అనుమతించకూడదు. – వి.ధనలక్ష్మి, నర్సు, టి.చాకిబండ పీహెచ్‌సీ, చిన్నమండెం



భయంతో వైద్యం చేయలేరు



వైద్యులపై దాడులు చేస్తే కఠిన చర్యలు అమలు చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం చేయాలి. నాడి పట్టి వైద్యులు భయంతో వైద్యం చేయలేరు. ఇటీవల కాలంలో డాక్టర్లపైన, దాడులు చేయడం ఆందోళన కలిగించే విషయం. ప్రతి వైద్యశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పూర్తి స్థాయిలో వైద్య సిబ్బందికి భద్రత కల్పించాలి. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన వారిని వదిలి పెడితే సమాజానికి చేటు. – రాజేశ్వరి, స్టాఫ్ నర్సు, పి.కొత్తపల్లె పీహెచ్‌సీ, సిద్దవటం

వైద్యురాలిపై హత్యాచారం బాధాకరం



ఇటీవల కోల్‌కతాలో మహిళా డాక్టర్‌పై జరిగిన హత్యాచారం చాలా బాధాకరమైనది. ఇలాంటి సంఘటనలు దేశంలో అనేకం జరుగుతున్నా ప్రభుత్వాలు చట్టాలు మార్చాలి. విచారణ, శిక్షల వేయడంలో జాప్యం చేయకూడదు. నిందితులు ఎంతటి వారైనా వదిలివేయకూడదు. ఈ సంఘటన తర్వాత మహిళా వైద్యులలో అభద్రతాభావం నెలకొంది. పని ప్రదేశాల్లో మహిళల భద్రతపైనా అనేక ప్రశ్నలు వచ్చాయి. పని చేసే ప్రతి మహిళకు భద్రత నివ్వాలి. – ఆసస్ వలీ, వైద్యులు, పీహెచ్‌సీ, సుండుపల్లె

క్లుప్తంగా

ఎన్‌సీసీ విద్యార్థుల 2కే రన్



2కే రన్‌లో పాల్గొన్న ఎన్‌సీసీ విద్యార్థులు, ఉపాధ్యాయులు

చిట్వేలి : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా ఎన్‌సీసీ విద్యార్థులచే 2కే రన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. 2కే రన్‌ను స్థానిక ఉన్నత పాఠశాల నుంచి కెకె వడ్డిపల్లి మూలరోడ్డు వరకు వెళ్లి తిరిగి పాఠశాల వరకు ఈ కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏబీఎన్ ప్రసాద్, దుర్గా ప్రసాద్, పీఈటీ షబ్బీర్, చినబాబు, బాలాజీ నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

60 టన్నుల యూరియా మంజూరు

సిద్దవటం : మండలానికి 60 మెట్రిక్ టన్నుల యూరియా మంజూరైందని వ్యవసాయాధికారి కె.రమేష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ పొన్నవోలు రైతు సేవా కేంద్రానికి 20 మెట్రిక్ టన్నులు, వంతాటిపల్లెకు 20 మెట్రిక్ టన్నులు, సిద్దవటానికి 20 మెట్రిక్ టన్నులు యూరియా మంజూరైందన్నారు. ఒక బస్తా యూరియా 45 కిలోలు ఉంటుందన్నారు. బస్తా విలువ రూ. 267.50 పైసలు అవుతుందని, మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ఆసక్తి గల రైతులు ఆధార్ కార్డు తీసుకొని డబ్బులు చెల్లించి యూరియాను పొందవచ్చునని ఆయన అన్నారు.

పక్కాగా ఫ్రీ హోల్డ్ భూముల పరిశీలన



ఫ్రీ హోల్డ్ భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్ భాగ్యలత

గాలివీడు : ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ల రీ వెరిఫికేషన్ ప్రక్రియను ప్రభుత్వ నిబంధనల మేరకు పక్కాగా చేపట్టినట్లు తహసీల్దార్ భాగ్యలత పేర్కొన్నారు. గురువారం మండలంలోని గోరాన్‌చెరువు గ్రామంలో ఆర్ఐ బాలాజీతో కలిసి ఆమె భూములను పరిశీలించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో 7172.87 ఎకరాల్లో ఫ్రీహోల్డ్ భూములున్నాయన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఫ్రీహోల్డ్ భూములను ఎవరైనా అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకుని ఉండుంటే బాధితులు ఫిర్యాదు చేయవచ్చన్నారు. అలానే తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సెప్టెంబర్ 3 నుంచి 15 వ తేదీ వరకు గ్రామాల్లో జరిగే రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సెప్టెంబర్ 3న వెలిగల్లు, 6న గాలివీడు, గాలివీడు – 3 సచివాలయం, 13న గోరన్ చెరువు, 17న ప్యారంపల్లి, 19న గోపనపల్లి, 21న గరుగుపల్లి,24 న గుండ్లచెరువు, 26న పందికుంట, 28న తలముడిపి, అక్టోబర్ 1న కొర్లకుంట,3న నూలివీడు, చీమలచెరువుపల్లి, 5న ఎగువగొట్టివీడు,8న అరవీడు, 10న పులికుంట,15న తూముకుంటలో సదస్సులు జరుగుతాయని తెలియజేశారు.

మాజీ ఉపరాష్ట్రపతికి బీజేపీ శ్రేణుల ఘన స్వాగతం



వెంకయ్యనాయుడుకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ రాజంపేట నాయకులు

రాజంపేట టౌన్ : తెలుగుభాషా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు గురువారం రైలు మార్గంలో వెళ్లిన భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు రాజంపేటలో బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. వెంకయ్యనాయుడు ప్రయాణిస్తున్న రైలు రాజంపేటకు చేరుకోగానే వెంకయ్యనాయుడును బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్, నాయకులు రమేష్‌నాయుడు, రమేష్ నాయుడు, గుణవర్మలు శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రమణరాజు తెలుగు భాషకు సంబంధించిన పుస్తకాన్ని వెంకయ్యనాయుడుకు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పి.నాగేశ్వరరావు, భీమిశెట్టి వెంకటేశ్వరరావు, పట్టుపోగుల ఆదినారాయణ, సూర్యచంద్ర, రమణ తదితరులు పాల్గొన్నారు.

తెలుగుభాష వైతాళికుడు ‘గిడుగు’ రామ్మూర్తి

- పాఠశాలల్లో ఘనంగా భాషా, క్రీడా దినోత్సవాలు
- తెలుగు ఉపాధ్యాయులకు సత్కారం
- విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు



రాజంపేట టౌన్: క్రీడల్లో రాణించిన విద్యార్థులతో అధ్యాపక బృందం



లక్కిరెడ్డిపల్లె: తెలుగు పండితులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది



నందలూరు: వంద మంది తెలుగు కవుల చిత్రపటాలను ప్రదర్శిస్తున్న దృశ్యం



రైల్వేకోడూరు అర్బన్: గిడుగుకు నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు



పుల్లంపేట మండల కేంద్రంలో..



చిన్నమండెం: తెలుగు భాషా, క్రీడల దినోత్సవాలను నిర్వహిస్తున్న దృశ్యం



రాయచోటి అర్బన్: తెలుగుపండితుడు రామచంద్రారెడ్డిని సన్మానిస్తున్న రోటరీక్లబ్ సభ్యులు



రాజంపేట: అన్నమాచార్య యూనవర్సిటీలో..



సిద్దవటం: విద్యార్థులకు బహుమతులను అందజేసిన హెచ్‌ఎం శ్రీరాములు

రైల్వేకోడూరు అర్బన్ : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగుభాషా అభివృద్ధికి ఎంతగానో కృషి చేసిన గిడుగు వెంకట రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిడుగును స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ తెలుగు భాషను విస్తృతం చేయాలని తెలిపారు. అలాగే స్థానిక మెయిన్ స్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయులు బొడ్డుబోయిన రాజగోపాల్ ఆధ్వర్యంలో పలువురు తెలుగు కవులను, గాయకులను సన్మానించి విద్యార్థులకు తెలుగు ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో దాసరి మోషే, జి.రమేష్, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నమండెం : మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో గురువారం తెలుగు భాషా దినోత్సవం, క్రీడల దినోత్సవాలను ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపల్ రమేష్ తెలిపారు. తెలుగు భాషా, వ్యవహారిక భాషగా దక్షిణ భారతదేశ భాషలందు సమున్నత భాషగా తీర్చిదిద్దడంలో గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన సేవ అనిర్వచనీయమని తెలుగు అధ్యాపకులు సుబ్బరాయుడు, గోపాల్‌లు తెలిపారు. క్రీడలు శారీరక, మానసిక వికాసానికి తోడ్పడుతాయని పీడీ రామాంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన పద్యపఠన, వ్యాసరచన, క్రీడల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీఓ నాగనవీన్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిద్దవటం : క్రీడలు స్నేహపూర్వక భావాన్ని, బృంద స్ఫూర్తిని పెంపొందిస్తాయని 11వ బెటాలియన్ జెడ్పీహెచ్‌ఎస్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు నాగమునిరెడ్డి తెలిపారు. గురువారం పాఠశాలలో హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్, తెలుగు భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు సిరాజుల్లా, ఉపాధ్యాయులు నరసింహులు, సమీర్‌బాషా, పోతులూరయ్య, సుబ్బరాయుడు, రవిశంకర్, విజయశ్రీ, రాజమ్మ, షేక్ మౌలాలి, రాజేష్, హేమంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

అలానే మండల కేంద్రంలోని తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గిడుగు చిత్రపటానికి ఘనంగా నివాళి అర్పించారు.

రాజంపేట టౌన్ : తెలుగుభాష ఉద్యమ పితామహుడు, తెలుగు సాహిత్య వైతాళికుడు గిడుగు రామ్మూర్తి అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.పురుషోత్తం తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం గిడుగు రామ్మూర్తి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. గతంలో పండితులు గ్రాంధిక భాషకు ప్రాధాన్యత ఇచ్చే వారని అందువల్ల సామాన్య ప్రజలు చదువుకునే అవకాశం లేకుండా ఉండేదన్నారు. తొలుత గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు చాన్‌బాషా, కె.వెంకటరమణ, వి.పార్వతి, బి.నాగరాజ, బి.రవీంద్రబాబు, ఒ.గీత తదితరులు పాల్గొన్నారు. అలానే హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ స్పోర్ట్స్‌డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీడీసీ డాక్టర్ నాగ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పీడీ మేజర్ సి.విజయభాస్కర్, అధ్యాపకులు డాక్టర్ చంద్రమోహన్, హవల్దార్ కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం తెలుగుభాష, క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయలలిత కుమారి అధ్యక్షతన తెలుగుభాష ఉపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ, గీత, రమణమ్మ, క్రీడా ఉపాధ్యాయురాలు గౌరీలు ఈ వేడుకలను నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారులు నాగయ్య, అనంతకృష్ణలు, జిల్లా సమ్మిళిత విద్య సమన్వయకర్త జనార్దన్‌లు ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రసంగించారు. గిడుగురామమూర్తి పంతులు తెలుగు బాషకు, హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ హాకీ క్రీడలకు చేసిన కృషిని ప్రశంసించారు. విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. తదుపరి నూరు మంది తెలుగు కవుల చిత్రపటాలు, ధ్యాన్ చంద్ చిత్రపటంతో ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శిల్పి ఆనందాచారి, రవిశంకర్ రెడ్డి, విజయ కుమారి, తులసీ స్వర్ణలత, జివి ప్రసాద్ రావు, జ్యోతి ప్రియ, ప్రమీలా, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి అర్బన్ : దేశభాషలలో కెల్లా తెలుగుభాష చాలా గొప్పదని తెలుగు పండితుడు రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఎస్‌ఎన్ కాలనీ ఎంపీపీ స్కూల్, మాసాపేట హైస్కూల్‌లలో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం వేడుకలు నిర్వహింపబడ్డాయి. ఎస్‌ఎన్‌కాలనీ ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు రోటరీక్లబ్ మాజీ అధ్యక్షుడు సురేష్‌కుమార్ ఆర్థిక సౌజన్యంతో తెలుగు పుస్తకాల ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం మాసాపేట హైస్కూలులో జరిగిన కార్యక్రమంలో క్లబ్‌సభ్యులు రామచంద్రా రెడ్డిని ఘనంగా సన్మానించారు.

ఓబులవారిపల్లె : దేశ భాషలందు తెలుగు లెస్స అని ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం చిన్నఓరంపాడు జెడ్పీహెచ్‌ఎస్‌లో తెలుగు భాష దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ వాడుక భాషలో తెలుగు రచనలు చేసిన మొట్టమొదటి వ్యక్తి గిడుగు రామ్మూర్తి అని అన్నారు. ఆయన జన్మదినం సందర్భంగా భాషా దినోత్సవాన్ని నిర్వహిస్తూ వస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు పాణ్యం నారాయణ, ఉపాధ్యాయులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరు : మండలంలోని పలు పాఠశాలల్లో తెలుగు భాష కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పెనగలూరు హైస్కూల్‌లో తెలుగు బాష పితామహుడు గిడుగు రామమూర్తి, హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటసుబ్బయ్య, రహ్మతుల్లా, బుజ్జి, పుచ్చకాయల ఎల్లయ్య, అశోక్ కుమార్, రాఘవరెడ్డి , మహేష్ నాయుడు, గోపాలకృష్ణ, చలపాటి నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి టౌన్ : తెలుగు భాష గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి గిడుగు రామూర్తి అని రాయచోటి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర నాయుడు అన్నారు. గురువారం తెలుగు భాష దినోత్సవం సందర్భంగా గిడుగు చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

గాలివీడు : తెలుగు భాష ఔన్నత్యం కోసం పాటుపడిన వ్యక్తి గిడుగు రామూర్తి అని ప్రధానోపాధ్యాయులు ఎన్.శ్రీనివాసులు అన్నారు. గురువారం అంతర్జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాష దినోత్సవం సందర్భంగా నూలివీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గిడుగు రామూర్తి, ధ్యాన్ చంద్ చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

రాజంపేట : అన్నమాచార్య యూనవర్సిటీలో భారత హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీఎస్ వైస్ ఛైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి మాట్లాడుతూ ధ్యాన్యచంద్ గౌరవ సూచకంగా భారతీయ క్రీడాకారులు ప్రతి సంవత్సరం అతని జయంతిని జరుపుకుంటున్నారన్నారు. జాతీయ క్రీడా దినోత్సవంను ఘనంగా జరుపుకుంటామన్నారు. ఉత్తమ క్రీడాకారులకు ధ్యాన్యచంద్ పేరిట అవార్డులు ఇచ్చి గౌరవిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పీడీ నాగముని, డీన్స్, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు తదితరులు పాల్గొన్నారు.

వీరబల్లి : తెలుగు భాష తల్లితో సమానమని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ అజంతుల్లా పేర్కొన్నారు. తెలుగుభాష దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు, అధ్యాపకులు రఘురామయ్య, శ్యామ్‌సుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లి : తెలుగు మాతృభాష కన్నతల్లితో సమానమని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి అన్నారు. తెలుగు భాష ఆరాధ్య దేవుడు గిడుగు రామమూర్తి జన్మదినం సందర్భంగా, అలాగే హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు గురువారం ఏపీ మోడల్ స్కూల్‌లో పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయులు శ్రీనివాసులు, ప్రసాద్, అరుణ్ కుమార్‌లను దుశ్శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నాగయ్య, పాఠశాల కమిటీ చైర్మన్ ఎనమల మణి, వైస్ చైర్మన్ చలపతి, ఉపాధ్యాయులు సుధాకర్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేట : మండల వ్యాప్తంగా తెలుగు భాష దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్, కొత్తపేటలోని జెడ్పీహెచ్‌ఎస్, దళవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్.రాజయ్య, ప్రసాద్ రెడ్డి, కిషోర్, ఇంద్రావతి, చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలకు గిట్టుబాటు ధర కల్పించాలి



లక్కిరెడ్డిపల్లె: ప్రజలతో మమేకమైన మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి



చిన్నమండెం: వెంకటరమణ సమాధి వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం

లక్కిరెడ్డిపల్లి : ప్రజలు సంతోషపడే విధంగా ప్రభుత్వం పాలన సాగించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. గురువారం పాలెంబురుజుపల్లిలో శ్రీకాంత్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు, రైతులు శ్రీకాంత్ రెడ్డిని కలిసి వర్షాలు లేక పంటలు నిట్టనిలువునా ఎండిపోతున్నాయని, వ్యవసాయ, కూలీలకు పనులు తగ్గాయన్నారు. పాల రేట్లు లీటర్‌కు రూ.10 తగ్గిందని రైతులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆయన హామీ ఇచ్చారు. పాలకు గిట్టుబాటు ధర కల్పించాలని శ్రీకాంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం గ్రామ పార్టీ కార్యకర్తలు, నాయకులతో ఆయన పలు అంశాలపై చర్చించారు. అలానే గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగముని కుమారుడు గంగాధర్‌ను శ్రీకాంత్ రెడ్డి పరామర్శించారు. అనంతరం బి.ఎర్రగుడి గ్రామం కాపుపల్లెలో గురువారం జరిగిన విశ్రాంత వ్యవసాయ విస్తరణాధికారి నెరసుపల్లె చిన్నపరెడ్డి పెద్దకర్మ కార్యక్రమంలో శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మోహన్ రెడ్డిలు పాల్గొన్నారు. చిన్నపరెడ్డి చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సమరసింహారెడ్డి, సర్పంచ్ రమణయ్య, ఎంపీటీసీ శ్రీలత, శంకర్ నాయుడు, మాజీ సర్పంచ్ రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నమండెం : దిగువగొట్టివీడు గ్రామ వైఎస్ఆర్ సీపీ నాయకుడు, సర్పంచ్ రాజమ్మ భర్త అయిన పుల్లగూర వెంకటరమణ గ్రామానికి చేసిన సేవలు ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి ఉంటాయని మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం వెంకటరమణ దశదిన కర్మకాండలో ఆయన దేవనాథరెడ్డితో కలిసి పాల్గొన్నారు. అతని సమాధి వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. వెంకటరమణతో తనకున్న అనుబంధాన్ని శ్రీకాంత్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కంబేళ్ల రమణ, వెంకటనారాయణ, విశ్వనాథరెడ్డి, కత్తి ఆంజనేయులు, మోహన్‌రెడ్డి, మల్‌రెడ్డిలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు క్రీడా పురస్కారాలు

సంబేపల్లె : జిల్లా స్థాయి క్రీడల్లో సంబేపల్లె ఆదర్శ పాఠశాల నాలుగవ స్థానం సాధించిందని ప్రిన్సిపల్ దిలీప్‌కుమార్ తెలిపారు. గురువారం క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రర్ చేతులమీదుగా అవార్డును ఆదర్శ పాఠశాల పీడీ షామీర్‌బాషా అందుకున్నారు.

మాసాపేట ఉన్నత పాఠశాలకు స్పోర్ట్స్ ఎక్సెలెన్స్ అవార్డు

రాయచోటి టౌన్ : మాసాపేట ఉన్నత పాఠశాలకు రాష్ట్ర స్థాయి ప్రతిష్టాత్మక స్పోర్ట్స్ ఎక్సెలెన్స్ అవార్డు దక్కిందని డీఈఓ శివప్రకాష్ రెడ్డి, ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివకుమార్ రెడ్డిలు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో క్రీడా విభాగంలో విశేష సేవలందించిన వారిని గుర్తించి ఈ అవార్డును అందిస్తారని తెలిపారు.

తమ పాఠశాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు అంబటి జగదీశ్వరయ్య విద్యార్థులను రాష్ట్ర స్థాయి క్రీడలలో ప్రతిభ కనబరిచేలా ప్రోత్సహించారని తెలిపారు. అలాగే అన్నమయ్య జిల్లాలో రెండవ స్థానం దక్కిందని చెప్పారు. అందుకు గాను గురువారం అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ చేతుల మీదుగా శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల ఆవరణంలో ప్రశంసా పత్రం అందుకున్నారన్నారు.

ఎక్కువ కేసుల పరిష్కారానికి సహకరించండి

లక్కిరెడ్డిపల్లి : సివిల్, క్రిమినల్ కేసులపై జాతీయ లోక్ అదాలత్‌లో సమస్యలు పరిష్కరించుకోవచ్చని లక్కిరెడ్డిపల్లి సివిల్ కోర్టు జడ్జి షేక్ ఫైజున్నిసా పేర్కొన్నారు. గురువారం స్థానిక కోర్టులో లక్కిరెడ్డిపల్లి, రామాపురం, గాలివీడు, పోలీస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెప్టెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఎక్కువ కేసుల పరిష్కారానికి అందరూ సహకరించాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్ఐలు సుధాకర్ రెడ్డి, రవీంద్రబాబు, రామకృష్ణ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ట పూజలు

పెనగలూరు : కొండూరు గ్రామంలో నిర్మించిన నూతన చెన్నకేశవ స్వామి నూతన ఆలయంలో ఉత్సవాలు గురువారంతో ఘనంగా ముగిశాయని ఆలయ ట్రస్టు చైర్మన్ విజయ్ రెడ్డి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కొండూరు ప్రభావతమ్మ, రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ మాజీ చైర్మన్ అజయ్‌రెడ్డి, మండల వైస్ ఎంపీపీ విజయ్ రెడ్డి దంపతుల సహకారంతో ఈ ఆలయాన్ని నిర్మించారు. మూడు రోజులపాటు విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో జరిపారు.

తైక్వాండోలో విద్యార్థుల ప్రతిభ

సిద్దవటం : శ్రీ సాయిహైస్కూల్ విద్యార్థులు తైక్వాండోలో ప్రతిభ కనబరిచి బంగారు, వెండి పతకాలను సాధించారని పాఠశాల కరస్పాండెంటు పోలు వెంకటసుబ్బయ్య తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ కడప మున్సిపల్ స్టేడియంలో గురువారం క్రీడల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన తైక్వాండో కరాటే పోటీల్లో విద్యార్థులు షేక్ మస్తాన్, షేక్ సోహేల్, షేక్ జావీద్‌లు బంగారు పతకాలు, సయ్యద్ ఇందాద్‌బాషా ఖాద్రి, షేక్ సర్వర్ వలీ వెండి పతకాలు సాధించారన్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి

రాయచోటి అర్బన్ : వైద్యులు, సిబ్బందిలు సమయపాలనను పాటించాలని డీపీఎంఓ డాక్టర్ రియాజ్‌బేగ్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎస్‌ఎన్‌కాలనీ పట్టణ ఆరోగ్యకేంద్రంలో నిర్వహింపబడుతున్న పెద్దల బీసీజీ టీకాల కార్యక్రమాన్ని ఆయన డీఎస్ఎంఓ విష్ణువర్ధన్‌రెడ్డితో కలసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు ప్రజలకు సేవలు అందించే విషయంలో అంకితభావంతో పనిచేయాలంటూ కోరారు. వైద్యులు, సిబ్బంది ఫీల్డ్ వెళితే మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో వివరాలు నమోదుచేయాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేస్తూ మున్సిపల్ అధికారులతో కలసి పారిశుధ్య పనుల నిర్వహణకు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యుడు నవీన్‌తోపాటు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బెట్టను తట్టుకునేందుకు మందుల పిచికారీ



వేరుశనగను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

రామాపురం : వేరుశనగ పంటను కడప ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు అంకయ్య, వీరయ్యలు పరిశీలించారు. మండలంలోని బండపల్లి పంచాయతీ వెంకటరెడ్డిగారిపల్లె రైతు సేవా కేంద్ర పరిధిలో దిగువ హరిజనవాడకు చెందిన ఎల్.మనోహర్ అనే రైతు వర్షాధారంగా సాగు చేసిన వేరుశనగ పంటను గురువారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేరుశనగ పంటలో బెట్టను తట్టుకునేందుకు 20 గ్రాముల యూరియా ఒక లీటర్ నీటికి లేదా 5 గ్రాములు మల్టీకే ఒక లీటర్ నీటికి లేదా 19.19.19.5 గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయడం ద్వారా బెట్ట నుండి కోలుకొని ఆరోగ్యంగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు అశోక్‌కుమార్, డాక్టర్ మాధవి, ఏడీఏ జయరాణి, ఏఓ నాగమణి, ఎంపీఈఓలు, రైతులు పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే ఆకేపాటి



సుండుపల్లె: గుట్టకాడబలిజపల్లిలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటి, నాయకులు

ఓబులవారిపల్లె : వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కువైట్ వైఎస్సార్‌సీపీ కార్యవర్గ సభ్యులు నాగినేని చంద్రశేఖర్‌రెడ్డి కుమార్తె విజయలక్ష్మి వివాహానికి రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వధూవరులను వారు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో చిట్వేలి మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులు రెడ్డి, రైల్వేకోడూరు వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సుండుపల్లె : వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమరనాథరెడ్డి గ్రామాలలో సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల మైనార్టీ నాయకుడు రహీంబాషా ఇటీవల కన్ను ఆపరేషన్ చేయించుకున్న సందర్భంగా వారింటికి వెళ్లి ఆయన్ను పరామర్శించారు. ఏటిగడ్డ రాచపల్లి గ్రామంలో వెంకటేశ్వర స్వామి పాలరాయితో కట్టే నూతన దేవాలయాన్ని సందర్శించారు. తదనంతరం గుట్టకాడబలిజపల్లిలో రెడ్డి చర్ల ధనుంజయ తల్లి దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

చెరువు ఆక్రమణపై ఫిర్యాదు

సుండుపల్లె : రాయవరం గ్రామ పంచాయతీలోని కొత్త జంగంపల్లిలో సర్వే నెంబరు 206లో 36 ఎకరాలు ఉండే చెరువును కొత్త జంగంపల్లి వాసులు ఆక్రమించి ఇళ్లు కడుతున్నారని దానిపై విచారణ చేసి స్థలం స్వాధీనం చేసుకోవాలని జంగంపల్లికి గ్రామస్తులు తహసీల్దార్ దైవాదీనంకు వినతిపత్రం అందజేశారు. చెరువు ఆక్రమణతో అక్కడ పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.